సాక్షి
జగిత్యాల
7
శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024

పెగడపల్లి: మొక్కులు తీర్చు కుంటున్న భక్తులు →





గద్దెకు చేరిన సమ్మక్క



జగిత్యాల రూరల్: తులాభారం వేస్తున్న భక్తులు

ధర్మపురి/జగిత్యాల రూరల్/పెగడపల్లి: ధర్మపురిలోని మోరోల్ల వాగువద్ద నిర్వహిస్తున్న వన దేవతల జాతరలో భాగంగా గురువారం సమ్మక్క అమ్మవారు గద్దెపైకి చేరారు. అమ్మవారల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస శివారులో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఎత్తు బంగారం సమర్పించారు. పెగడపల్లి మండల కేంద్రంలో జాతర గురువారం జోరుగా సాగింది. భక్తులు వివిధ గ్రామాల నుంచి తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.



ధర్మపురి: వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



ధర్మపురి: ఎత్తు బంగారాన్ని అమ్మవారికి సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు



ధర్మపురి: సమ్మక్క భక్తులు, కోయ పూజారుల పూనకాలు

న్యూస్‌రీల్

అధికారులకు ఎన్నికల శిక్షణ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అదనపు కలెక్టర్ లత అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల సెక్టోరల్ అధికారులకు ఎన్నికల శిక్షణ ప్రారంభించారు. సెక్టోరల్ అధికారులు ఎన్నికల కమిషన్ నియామవళిని తప్పనిసరిగా పాటించాలని, కేటాయించిన సెక్టర్ పరిధిలోగల పోలింగ్ స్టేషన్లను పరిశీలించి కనీస వసతులు, మ్యాపింగ్ వంటి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించి మ్యాపింగ్ తోపాటు, రూట్‌ప్లాన్ తదితర అంశాలతో రెండురోజుల్లో సమగ్ర వివరాలను రిటర్నింగ్ అధికారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో కోరుట్ల రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్, ట్రైనర్ తిరుపతి పాల్గొన్నారు.

ఈ ఏడాది నాలుగు జాతీయ లోక్‌అదాలత్‌లు

జగిత్యాలజోన్: జిల్లాలోని అన్ని కోర్టుల్లో ఈ ఏడాది నాలుగు జాతీయస్థాయి లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. మొదటి అదాలత్ మార్చి 9న, రెండో అదాలత్ మే 11న, మూడో అదాలత్ సెప్టెంబర్ 14న, నాలుగో అదాలత్ డిసెంబర్ 14న నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇరువర్గాలు రాజీ కుదుర్చుకున్న కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు.

పరీక్షలు స్వేచ్ఛగా రాయాలి



అవగాహన కల్పిస్తున్న డీఈఓ, శిక్షకులు

మల్యాల: విద్యార్థులు పరీక్షలను స్వేచ్ఛగా రాయాలని, ఒత్తిడికి గురికావొద్దని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నూకపల్లి మోడల్‌స్కూల్‌లో గురువారం పది, ఇంటర్ విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ వికాసంపై లీడ్ ఇండియా శిక్షకులు శ్రీనివాస్, వరుణ్ అవగాహన కల్పించారు. పరీక్షలంటే భయపడవద్దని, ఆత్మవిశ్వాసంతో రాయాలని సూచించారు. ప్రిన్సిపాల్ సరితాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను నెరవేర్చేలా క్రమశిక్షణతో చదువుతూ, సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటించాలని, ప్రత్యేక తరగతులు, ప్రీఫైనల్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌ఎండీ ఎగువ ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీటి విడుదల



ఎస్సారెస్పీ కాకతీయ కాలువ

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా ఎల్‌ఎండీ (లోయర్ మానేర్ డ్యాం) ఎగువ ఆయకట్టు (జోన్–2)కు శుక్రవారం నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు. జోన్–2కు నీటి విడుదల చేస్తున్నందున జోన్–1 పరిధి (ఎల్‌ఎండీ దిగువ భాగం)లోని కాకతీయ కాలువ తూములన్నీ మూసివేయాలని కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని, కాలువ దరిదాపుల్లోకి ఎవరూ వెళ్లవద్దని అధికారులు సూచించారు.

బైపాస్ సర్వే అడ్డగింపు



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

మెట్‌పల్లిరూరల్: బైపాస్ రహదారితో విలువైన భూములు కోల్పోతున్నామంటూ రైతులు భూసర్వేను అడ్డుకున్నారు. గురువారం మెట్‌పల్లి మండలం వెల్లుల శివారులో బైపాస్ కోసం సర్వే చేస్తున్న విషయం తెలుసుకున్న రైతులు ఆ ప్రాంతానికి వెళ్లి అడ్డుకున్నారు. భూసర్వే వెంటనే ఆపివేయాలని హెచ్చరించారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి సముదాయించారు. బైపాస్‌లో ముంపునకు గురవుతున్న భూములకు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందన్నారు.

వన్యప్రాణుల దాహం తీర్చేలా..

- అడవుల్లో 129 సాసర్‌పిట్స్ ఏర్పాటు
- రెండు సోలార్ బోర్ల నిర్మాణం
- అటవి జంతువుల కోసం నీటి వసతులు



అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌డ్యామ్



అడవిలోని సాసర్‌పిట్స్‌లో నీరు నింపుతున్న అధికారులు

జగిత్యాలక్రైం: అడవుల్లో ఉండే వన్యప్రాణులు వేసవిలో తాగునీటి కోసం బయటకు వస్తుండటంతో కుక్కలు, వేటగాళ్ల బారిన పడుతున్నాయి. కొన్నిసార్లు ప్రమాదవశాత్తు బావుల్లో పడి మృత్యువాతపడుతున్నాయి. తద్వారా వాటి సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో జిల్లా అటవీశాఖ అధికారులు వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. వాటికి నిత్యం నీటిని అందుబాటులో ఉంచి వాటి దాహం తీర్చుతున్నారు. జిల్లాలోని ఐదురేంజ్‌ల పరిధిలో సుమారు 53 వేల హెక్టార్లలో అటవీ విస్తరించి ఉంది. అందులో ఉండే వన్యప్రాణులు వేసవిలో నీటి కోసం బయటకు రాకుండా అడవిలోనే ఏర్పాట్లు చేస్తున్నారు.

129 సాసర్‌పిట్స్ నిర్మాణం

అడవుల్లో నీటిని నిల్వ చేసేందుకు జిల్లావ్యాప్తంగా మొత్తం 129 సాసర్‌పిట్స్, పర్కులేషన్ ట్యాంకులు నిర్మించారు. అందులో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. సాసర్‌పిట్స్‌లో ఉంచిన నీటిని రాత్రి వేళ వన్యప్రాణుల తాగి దాహార్తి తీర్చుకుంటున్నాయి.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణం

జిల్లాలో అడవుల్లో భూగర్భజలాలు పెంచేందుకు ఇప్పటికే 45చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. వాటితోపాటు మరో 20 నీటి కుంటలున్నాయి. ఇందులో వర్షపు నీటిని వృథాగా పోకుండా అడ్డుకట్ట వేసి చెక్‌డ్యామ్‌లు, కుంటల్లో నిల్వ చేశారు. పరిసర ప్రాంతాల్లోని వన్యప్రాణులు ఆ నీటిని తాగుతూ అడవుల్లో స్వచ్ఛగా జీవిస్తున్నాయి. మరోవైపు భూగర్భ జలాలు పైకి వచ్చి అడవుల్లో ఉన్న చెట్లు కూడా విస్తారంగా పెరిగేందుకు ఈ నీటి నిలువలు ఎంతో దోహదపడుతున్నాయి.

రెండు సోలార్‌బోర్లు

అడవుల్లో రెండు సోలార్ బోర్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటి పనితీరు ఆధారంగా మరికొన్ని బోర్లు ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నారు. సోలార్ ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో బోర్ల ద్వారా నీటిని తోడి వన్యప్రాణుల దాహం తీర్చుతున్నారు.

వన్యప్రాణుల కోసమే..



జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న వన్యప్రాణులకు వేసవి దృష్ట్యా నీటి వసతి కల్పిస్తున్నాం. తాగునీటి కోసం వన్యప్రాణులు బయటకు వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నాయి. అందుకే అడవిలో వన్యప్రాణాలు సంచరించే ప్రాంతాల్లో ప్రత్యేకంగా సాసర్‌పిట్స్ ఏర్పాటు చేస్తున్నాం.
– వెంకటేశ్వర్‌రావు, జిల్లా అటవీశాఖ అధికారి

జిల్లాలో అడవుల విస్తీర్ణం 53 వేల హెక్టార్లు	
సాసర్‌పిట్స్	129
చెక్‌డ్యామ్‌లు	45
నీటికుంటలు	20
సోలార్ బోర్లు	2

అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకొచ్చింది

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

కోరుట్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. పట్టణంలోని పద్మశాలీ భవనంలో గురువారం పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై రాష్ట్రప్రభుత్వం వద్ద స్పష్టతగానీ, ప్రణాళికగానీ లేదన్నారు. గ్యారంటీలను పార్లమెంట్ ఎన్నికల తర్వాతనైనా కొనసాగిస్తారనే నమ్మకం లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు గడుస్తున్నా ఎందుకు కాలయాపన చేస్తోందని ప్రశ్నించారు. వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500, బోనస్, రూ.2లక్షల రుణమాఫీ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు రామ మందిరం నిర్మాణంపై కపిల్ సిబాల్‌తో కోర్టులో కేసు వేయించారని తెలిపారు. 40ఏళ్లుగా కాంగ్రెస్ హయాంలో రాని పసుపు బోర్డును తాను తీసుకొచ్చానని పేర్కొన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు తన నల్ల కళ్లద్దాలపై రాద్ధాంతం చేస్తున్నారని, ప్రజలు తనకు రెండు కళ్లలాంటివారని కళ్లద్దాలతో వాళ్లను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. దేశంలో బీజేపీకి 370 సీట్లు ప్రధాని నరేంద్రమోదీ టార్గెట్ ఇచ్చారని, ఆ మొత్తం సాధించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణ రావు, పార్లమెంట్ ప్రభారి వెంకటరమణ, అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, పార్గమెంట్ కన్వీనర్ గడ్డె భూమయ్య, కో–కన్వీనర్ గుంటుక సదాశివ్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బది‘లీలలు’

- జిల్లాలో 45 మందికి స్థానచలనం
- ఇష్టారీతిన చేపట్టారని ఆరోపణలు

- ‘కథలాపూర్ మండలంలో.. కోరుట్ల – వేములవాడ రూట్‌లో ఉన్న ఓ గ్రామంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శిది కోరుట్ల. ఆయనను బుధవారం రాత్రి జరిగిన బదిలీల్లో వెల్గటూర్ మండలంలోని ఓ గ్రామానికి పంపించారు..’

- ‘కోరుట్లలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీ కార్యదర్శిని బుగ్గారం మండలంలోని ఓ గ్రా మానికి బదిలీ చేశారు. పైరవీలతోనే ఇలా జరిగిందని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..’

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో 45 మంది పంచాయతీ కార్యదర్శులను ఓ గ్రామం నుంచి మరో గ్రామానికి బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పైరవీలు చేసుకున్నవారికి మాత్రం సమీప గ్రామాలకు బదిలీ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల బదిలీ ఉత్తర్వులపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కొందరి ఇష్టమొచ్చిన స్థానానికి బదిలీ చేయడానికి తమను బలి చేశారని బదిలీ అయిన కార్యదర్శులు వాపోతున్నారు. జిల్లాలో 20 మండలాలు, 380గ్రామాలు ఉన్నాయి. ప్రతి పంచాయతీకి ఓ కార్యదర్శి ఉన్నారు. దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్న వారితోపాటు అనారోగ్య సమస్యలున్నవారు బదిలీల కోసం కొన్ని నెలలక్రితం అధికారులకు విన్నవించారు. ఇలా సుమారు 20 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నట్లు తెలిసింది. అయితే బదిలీల ఉత్తర్వుల్లో 45మంది పేర్లు ఉన్నాయి. 20 మంది కార్యదర్శులు మాత్రమే బదిలీ కోసం విన్నవించుకోగా.. 45 మందిని బదిలీ చేయడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో కొందరికి నచ్చిన చోట పోస్టింగ్‌లు దక్కగా.. మరికొందరికి దూరంగా ఉన్న గ్రామాలకు బదిలీ కావడంతో అక్రమాలు జరిగినట్లు పలువురు కార్యదర్శులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేసే సమయంలో రోస్టర్ పాయింట్లు ఇవ్వడం, ఆప్షన్లు ఇచ్చి బదిలీలు చేస్తుంటారని.. తమకు తెలియకుండానే బదిలీ ఉత్తర్వులు ఆయా మండల పరిషత్ కార్యాలయాలకు మెయిల్, వాట్సాప్‌ల ద్వారా పంపించడం దారుణమని మండిపడుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపి బదిలీలపై విచారణ చేపట్టాలని కార్యదర్శులు కోరుతున్నారు.

పనితీరు ఆధారంగానే

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు వారి పనితీరు ఆధారంగానే చేపట్టాం. బదిలీల్లో ఎలాంటి పైరవీలు చోటు చేసుకోలేదు. కొందరు దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేస్తున్నారని గుర్తించి వారిని ఇతర గ్రామాలకు బదిలీ చేశాం. – దేవరాజ్, డీపీవో



నృసింహుని బ్రహ్మోత్సవాల్లో అగ్నిప్రతిష్ఠ

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి ఆలయ ప్రాంగణంలో అగ్నిప్రతిష్ఠ, బలిహరణ, హోమం కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ అల్లకొండ సామ్రాట్, ఎంపీపీ మసర్తి రమేశ్, అర్చకులు వొద్దిపర్తి పెద్దసంతోష్, చిన్న సంతోష్, మధుకుమార్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల దుకాణాల తనిఖీ



తనిఖీ చేస్తున్న వాణి

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లిలోగల ఎరువులు, విత్తనాల దుకాణాలను మెట్‌పల్లి ఏడీఏ రమేశ్ గురువారం తనిఖీ చేశారు. తిరుమల ఫర్టిలైజర్ షాప్ రికార్డులు తనిఖీ చేయగా.. సక్రమంగా లేని కారణంగా లైసెన్స్ రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ఏవో యోగితా, ఏఈవో శేఖర్ ఉన్నారు.

ధరల పట్టిక తప్పనిసరి

జగిత్యాలఅగ్రికల్చర్:ఫర్టిలైజర్ దుకాణాల్లో ధరల పట్టిక తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి వాణి అన్నారు. జగిత్యాలఅర్బన్ మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం తనిఖీ చేశారు. ఎరువుల అమ్మకం, నిల్వల వివరాలను రిజిస్టర్‌లో పొందుపర్చాలని, రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి వినీల, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన టైలరింగ్, డ్రాయింగ్ హయ్యర్/లోయర్ ప్రశ్నపత్రాలు గురువారం జిల్లాకేంద్రంలోని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. ఈనెల 24 నుంచి 27వరకు జిల్లాకేంద్రంలో నాలుగు సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. టేలరింగ్ పరీక్షకు తిప్పన్నపేట శివారులోని సూర్యగ్లోబల్ స్కూల్, రామకృష్ణ పాఠశాల, డ్రాయింగ్ పరీక్షకు జెడ్పీహెచ్ఎస్ ధరూర్ క్యాంప్, వీక్లీబజార్ పాఠశాలలను కేంద్రాలుగా గుర్తించారు.

యావర్‌రోడ్డును విస్తరిస్తాం

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని యావర్, బైపాస్ రోడ్ విస్తరిస్తామని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎల్‌ఎల్ గార్డెన్ నుంచి గుట్ట రాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే ప్రతిపాదిత 60 ఫీట్ల లింక్ రోడ్డు ప్రాంతాన్ని బల్దియా అధికారులతో కలిసి పరిశీలించారు. పనులకు రూ.10కోట్లు అవసరమని, ఆర్‌అండ్‌బీకి బదిలీ చేస్తే బల్దియాపై భారం తగ్గుతుందన్నారు. యావర్‌రోడ్డును 100 ఫీట్లకు విస్తరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీపీఎస్ తేజస్విని, బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.

మా ఉద్యోగం మాకిప్పించండి

జీతాలు అడిగితే విధుల్లోంచి తొలగించారని, తమకు ఉద్యోగం ఇప్పించాలని రాయికల్ మున్సిపాలిటీ ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎమ్మెల్సీకి వివరించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. సమ్మె కాలం వేతనంతోపాటు, డిసెంబర్ 2023 నుంచి ఈనెల వరకు తమకు గౌరవ వేతనం ఇప్పించాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎమ్మెల్సీకి విజ్ఞప్తి చేశారు.



ప్రతిపాదిత రోడ్డును పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

వారంలో మరో రెండు పథకాలు

సారంగాపూర్: వారంరోజుల్లో మరో రెండు గ్యారంటీలను అమలు చేస్తామని ఎమ్మెల్సీ తెలిపారు. మండలంలోని పెంబట్ల దుబ్బరాజన్న ఆలయం, కోనాపూర్‌లోని గంగమ్మ తల్లి ఆలయంలో పూజలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడానికి ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. నాయకులు బొడ్డుపల్లి రాజన్న, ఆకుల రాజిరెడ్డి, ముద్దం చిరంజీవి, తోట మల్లయ్య, బెజ్జంకి రమేశ్, కొలపాక రవి, వాసం శ్రీనివాస్, తోడేటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



కనులపండువగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నల్లగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం దంపతులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈనెల 24న రథోత్సవం ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈవో అనూష, జెడ్పీటీసీ ప్రశాంతి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని రైతు మృతి

- చేను వద్దకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం


నర్సింహారెడ్డి(ఫైల్)

కథలాపూర్(వేములవాడ): మండలంలోని ఇప్పపెల్లికి చెందిన రైతు కోలి నర్సింహారెడ్డి (57) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. నర్సింహారెడ్డి బుధవారం రాత్రి గ్రామ శివారులోని తన మిర్చి పంట వద్దకు బైక్‌పై వెళ్లాడు. అదే సమయంలో ఓ కారు స్పీడ్‌గా వచ్చి నర్సింహారెడ్డి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నర్సింహారెడ్డిని చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. నర్సింహారెడ్డి కుమారుడు నర్సారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎండీ.ఖలీం తెలిపారు.

కారు ఢీకొని యువకుడు..


మోహన్ (ఫైల్)

కరీంనగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం .. వల్లంపహాడ్‌కు చెందిన కొత్తూరి రవికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు మోహన్(19) బుధవారం రాత్రి 11.20 గంటలకు ద్విచక్రవాహనంపై మెయిన్ రోడ్డులోని కిరాణ దుకాణానికి వెళ్లాడు. ఈ క్రమంలో కరీంనగర్ నుంచి చొప్పదండి వైపు వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. స్థానికులు గమనించి, రవికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లాడు. మోహన్ రెండు కాళ్లు, తొడలు, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బ్లూకోల్ట్స్ పోలీసులు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని భక్తురాలి మృతి


గంగవ్వ మృతదేహం

ధర్మపురి: సమ్మక్క, సారలమ్మను దర్శించుకుని ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ భక్తురాలు మృతి చెందింది. ఎస్సై ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం.. ధర్మపురిలోని శ్రీలక్ష్మీనరసింహకాలనీకి చెందిన తొట్ల గంగవ్వ (50) తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం సాయంత్రం సమీపంలోని సమ్మక్క, సారలమ్మను దర్శించుకుంది. వనదేవతలకు మొక్కులు చెల్లించి కాలినడకన ఇంటికి బయల్దేరింది. బీర్‌పూర్‌కు చెందిన యవకులు ద్విచక్రవాహనంపై అతి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో గంగవ్వ తీవ్రంగా గాయపడింది. ఆమెను వెంటనే స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. గంగవ్వకు భర్త మల్లయ్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విత్తన నిల్వలు ఆన్‌లైన్

- ఫాం–డీని తెరపైకి తెచ్చిన ప్రభుత్వం
- కల్తీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకే..
- డీలర్లు వివరాలు నమోదు చేయాల్సిందే
- కరీంనగర్ జిల్లాలో నాలుగు వ్యవసాయ డివిజన్లు

కరీంనగర్ అర్బన్: కల్తీ విత్తనాల అడ్డుకట్ట కోసం ప్రభుత్వం సరికొత్త పంథాలో ముందుకుసాగుతోంది. లైసెన్స్‌డ్ విత్తన డీలర్లు అక్రమ నిల్వలు చేయకుండా ఉన్న నిల్వల సమాచారం పక్కాగా ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా ఫాం–డీని తెరపైకి తెచ్చింది. రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ సైట్‌లో సదరు వివరాలతో వింగ్ ఏర్పాటు చేయగా అందులో విత్తన డీలర్లందరూ వివరాలు నమోదు చే యడం తప్పనిసరి. ఇప్పటికే కరీంనగర్ జిల్లాలోని డీలర్లకు అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.శ్రీనివాస్ పర్యవేక్షణ చేస్తుండగా మండలాల వ్యవసాయ అధికారులు డీలర్లకు ఐడీ, లాగిన్ క్రియేట్ చేశారు. వివరాలను నమోదు చేసేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. సాంకేతిక వ్యవసాయ అధికారి కృష్ణ సా ంకేతికంగా ఏర్పడే సమస్యలను పరిష్కరిస్తున్నారు.

ప్రతి నెలా 5లోగా నమోదు

ఏ కంపనీ విత్తనాలు ఎన్ని ఉన్నాయి, ఏయే రకాల విత్తనాలు, లాట్ నంబర్, కంపనీ వివరాలు, విక్రయించింది ఎంత, ఉన్న నిల్వ ఎంతనేది ప్రతి నెలా 5వ తేదీలోగా సైట్‌లో పొందుపరచాలి. విత్తన డీలర్ పరిధిలో ఎన్ని క్వింటాళ్లు, ఏయే విత్తనాలు ఉన్నాయో క్వింటాళ్లలో నమోదు చేయాలి. జిల్లాలో 465 మంది డీలర్లు ఉండగా ప్రధానంగా పత్తి, వరి, మొక్కజొన్న, జొన్న, పెసలు, కందులు, మినుములు, కూరగాయలు తదితర విత్తనాలు విక్రయిస్తున్నారు. కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, గంగాధర, మానకొండూరు, శంకరపట్నం, కొత్తపల్లి, తిమ్మాపూర్ మండలాల్లో ఎక్కువ మంది డీలర్లు ఉండగా, హోల్‌సేల్ డీలర్లు కరీంనగర్, హుజూరాబాద్‌లో ఉన్నారు.


ఫాం–డీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మండలాల వారీగా విత్తన దుకాణాలు

కరీంనగర్ అర్బన్‌లో 65, కరీంనగర్ రూరల్ 19, కొత్తపల్లి 18, చొప్పదండి 24, రామడుగు 35, గంగాధర 36, మానకొండూరు 19, శంకరపట్నం 16, గన్నేరువరం 25, తిమ్మాపూర్ 22, చిగురుమామిడి 39, హుజూరాబాద్ 23, జమ్మికుంట 53, వీణవంక 27, ఇల్లందకుంట 23, సైదాపూర్ 21.

నిఘా బృందం ఆకస్మిక తనిఖీలు

కరీంనగర్ జిల్లాలో 313 గ్రామాలుండగా సాగు విస్తీర్ణం 3,33231 ఎకరాలు. రైతులు 1,83,209 మంది రైతులు ఉన్నారు. కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, చొప్పదండి వ్యవసాయ డివిజన్లు ఉన్నాయి. కరీంనగర్‌లో 102, హుజూరాబాద్‌లో 147, మానకొండూరులో 121, చొప్పదండిలో 95 మంది విత్తన డీలర్లు ఉన్నారు. ఏటా కల్తీ విత్తనాల విక్రయాలు పెచ్చుమీరుతుండగా పోలీసు, వ్యవసాయ శాఖలు కేసులు నమోదు చేస్తున్నాయి. పత్తి, మొక్కజొన్న నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తుండగా ఈ ప్రక్రియతో దాదాపు సగం కల్తీని నిలువరించినట్లే. ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయడం వల్ల రాష్ట్రస్థాయిలోని నిఘా బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించనుంది. మిగతా విత్తనాలు కనిపిస్తే కఠినంగా వ్యవహరించనున్నారు. అవసరమైతే జైలుకు పంపే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇక, విత్తన డీలర్లు కాకుండా ఇతర వ్యాపారులు విత్తనాలు విక్రయించినా లైసెన్స్ లేదనేది వెబ్‌సైట్ ద్వారా ఇట్టే తెలిసిపోనుంది. జిల్లా వ్యవసాయ శాఖతో సంబంధం లేకుండా ఏ జిల్లా అధికారులైనా తనిఖీలు చేయొచ్చని స్పష్టమవుతోంది. సాగు విస్తీర్ణం క్రమంలో ఏయే విత్తనాలు వేస్తున్నారు, ఎంత వేశారు, ఏ విత్తనాలు మిగిలాయన్నా వివరాలు సులువుగా తెలుస్తాయి.

ప్లాస్టిక్ వ్యర్థాలు కాల్చి.. బూడిదగా మార్చి..

- ప్లాస్మిక్ కోర్ ఇన్సినరేటర్ ట్రయల్ రన్ సక్సెస్

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో ఎట్టకేలకు ప్లాస్టిక్ వ్యర్థాలను దహనం చేసి బూడిదగా మార్చే ప్లాస్మిక్ కోర్ ఇన్సినరేటర్ యంత్రానికి గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. పట్టణ ప్రగతి నిధులు రూ.39లక్షల వ్యయంతో మూడేళ్ల క్రితం కొనుగోలు చేసిన ఈ యంత్రాన్ని ఒక్కరోజు కూడా వాడకుండానే నిరుపయోగంగా మార్చారు. దీనిపై 'సాక్షి'లో వరుసగా కథనాలు కూడా ప్రచురితమయ్యాయి. 'లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు..' అనే శీర్షికను 'సాక్షి' మూడు నెలల క్రితం ప్రచురించడంతో మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించారు.

తక్కువ విద్యుత్‌తో..

ఇటీవల కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సైతం ఈ యంత్రాన్ని స్వయంగా పరిశీలించారు. యుద్ధప్రాపతిదికన యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో స్థానిక గౌతమినగర్ డ్రై రీసోర్స్ సెంటర్‌లో ఉన్న ప్లాస్మిక్ కోర్ ఇన్సినరేటర్ యంత్రానికి మున్సిపల్ కమిషనర్ సమక్షంలో గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. ప్లాస్మిక్ కోర్ ఇన్సినరేటర్ యంత్రం సంతృప్తికరంగా పని చేస్తుండడంతో, త్వరలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని కమిషనర్ తెలిపారు. తక్కువ విద్యుత్ వినియోగించుకొని ఈయంత్రం రోజుకు 750 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను బూడిద చేస్తుందని కమిషనర్ వెల్లడించారు. చెత్త రీసైక్లింగ్ చేయడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ యంత్రం ద్వారా వెలువడిన బూడిదతో, ఇటుకలు తయారు చేసుకొని ఉపయోగించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఏఈ షాబాజ్, సానిటరీ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, ఏఈ ఎలెక్ట్రికల్ రాంజీ, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.


ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న రామగుండం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

అగ్ని ప్రమాద కుటుంబాలకు రూ.లక్షన్నర అందజేత

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ అగ్ని ప్రమాద కుటుంబాలకు 42వ డివిజన్ కార్పొరేటర్ మేచినేని వనజ భర్త అశోక్‌రావు గురువారం రూ.లక్షన్నర ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సూచన మేరకు సాయం అందించామన్నారు. బాధితులు అధైర్యపడవద్దని, ప్రస్తుతం ఉంటున్న చోటనే నివాసం ఉండేలా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడతామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావులతోపాటు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


ఆర్థికసాయం అందిస్తున్న అశోక్‌రావు

తాళం వేసిన ఇంట్లో చోరీ


చొప్పదండి: బీరువాను తెరిచిన దొంగలు

చొప్పదండి: పట్టణంలోని శ్రీరామా టాకీస్ ఏరియాలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడ్డారు. గంగపుత్ర సంఘం సమీపంలో నివాసం ఉండే బట్టు శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో మూడు రోజుల క్రితం షోలాపూర్‌కు పెళ్లి నిమిత్తం వెళ్లారు. బుధవారం రాత్రి స్వస్థలం చొప్పదండిలోని ఇంటికి రాగానే గేటు తాళం వేసి ఉంది కానీ ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని బీరువా పగుల గొట్టి, బట్టలు చిందర వందరగా ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సుమారు రూ. 80 వేల విలువైన వెండి, బంగారం చోరీ చేశారని తెలిపాడు. వరుస చోరీ ఘటనల నుంచి ఇటీవల పట్టణ ప్రజలు ఉపశమనం పొందగా మళ్లీ చోరీ సంఘటనతో పట్టణ ప్రజలు ఉలిక్కిపడ్డారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

కోరుట్లరూరల్: పట్టణ శివారులోని బొమ్మెన రోడ్డు క్రాసింగ్ వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొనటంతో పట్టణానికి చెందిన కొమురవెల్లి రాకేష్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. రాకేశ్ పనినిమిత్తం గురువారం రాత్రి జగిత్యాల వెళ్లి వస్తున్నాడు. బొమ్మెన వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద నాగులపేటకు చెందిన ఇసుక ట్రాక్టర్ జగిత్యాల వైపు వస్తూ.. రాకేశ్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో రాకేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

పోయిందనుకున్న నెక్లెస్ దొరికిందోచ్..

బోయినపల్లి(చొప్పదండి): నెక్లెస్ కనిపించడం లేదని మండలంలోని నీలోజిపల్లికి చెందిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తీరా ఇంట్లోనే దొరకడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఇంట్లోనే నగ పెట్టుకొని పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లడంతో అంతటా చర్చనీయాంశమైంది. మండలంలోని నీలోజిపల్లికి చెందిన ఎల్లవ్వ బుధవారం నిమ్మపల్లిలో ఓ వివాహానికి బంగారు నెక్లెస్ ధరించి వెళ్లింది. ఇంటికొచ్చిన తర్వాత నెక్లెస్ తీసి ఇంట్లోని సెల్ఫ్‌లో దాచిపెట్టింది. తీరా గురువారం నెక్లెస్ చూస్తే కనిపించకపోవడంతో దొంగతనం జరిగిందనే అనుమానంతో ఆమె భర్త నారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై శ్రీకాంత్ డాగ్‌స్క్వాడ్, ఫింగర్‌ప్రింట్ బృందాలతో వచ్చి గురువారం రాత్రి ఎల్లవ్వ ఇంట్లో వెదికారు. ఇంట్లోనే బంగారు నెక్లెస్ దొరికింది.

సమ్మక్క జాతరలో ఘర్షణ

- పలువురికి గాయాలు
- బంగారం, డబ్బులు మాయం

ధర్మపురి: ధర్మపురిలో నిర్వహిస్తున్న సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవాల్లో గురువారం ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు భక్తులకు గాయాలయ్యాయి. భక్తుల డబ్బులు, బంగారం అపహరణకు గురైందని ఆలయ కమిటీ చైర్మన్ ఒల్లెపు శంకర్, పూజారి వెంకటేశం తెలిపారు. జాతరలో గద్దెలకు ముందుభాగంలో కొందరు ఐస్‌క్రీం బండ్లు అడ్డుగా పెట్టడంతో ఆలయ సేవకులు వారిని పక్కకు పెట్టుకోవాలని మందలించారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కొందరు యువకులు, మహిళలు ఆలయ ప్రాంగణంలోకి చొచ్చుకుని వచ్చి ఆలయ నిర్వాహకులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో కమిటీ ఉపాధ్యక్షుడు అల్లకొండ చంద్రయ్యకు గాయాలయ్యాయి. ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో ఆయనను చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. గొడవలో చైర్మన్ భార్య నాగలక్ష్మికి చెందిన ఆరు తులాల బంగారు ఆభరణాలు తెగిపోయి.. అందులో కొంత మాయమైనట్లు తెలిపారు. ఓ భక్తురాలి సెల్‌ఫోన్, డబ్బులు మాయమైనట్లు బాధితులు తెలిపారు. గొడవలో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. ఉత్సవాల్లో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయక పోవడంతోనే ఈ ఘర్షణ చోటు చేసుకుందని చైర్మన్ శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్ నుంచి 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. సిరిపూర్ శివారులో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఓ బొలెరో వాహనం అనుమానాస్పదంగా కనిపించింది. తనిఖీ చేయగా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. బియ్యంతోపాటు వాహనాన్ని సీజ్ చేశామని, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ మృతి

కరీంనగర్‌క్రైం: రోడ్డు ప్రమాదంలో ఓ ఆటోడ్రైవర్ మృతిచెందినట్లు కరీంనగర్ టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని హుస్సేనిపురకు చెందిన ఎండీ.అఫ్జలొద్దీన్(45) ప్రతిరోజూ తన ఆటోలో మెడికల్ విద్యార్థులను కాలేజీకి తీసుకెళ్తాడు. గురువారం ఉదయం తీసుకెళ్తుండగా డాక్టర్స్ స్ట్రీట్‌లో ఓ వాహనం అడ్డు వచ్చింది. దాన్ని తప్పించబోయి మధ్యలో ఉన్న ట్రాఫిక్ స్టాండ్‌కు ఢీకొట్టాడు. ఈ ఘటనలో అఫ్జలొద్దీన్ తలకు తీవ్ర గాయాలవడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

కరీంనగర్‌క్రైం: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జిల్లా కోర్టు ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ.సర్వర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఐదుగురిని పోలీసులు గురువారం కోర్టులో హాజరుపరిచారు. వీరిలో ఒకరికి 7 రోజులు, మరొకరికి 3 రోజుల జైలుశిక్ష, రూ.3,500 జరిమానా, మిగతా ముగ్గురికి రూ.5,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

ఒకరి ఆత్మహత్య


రాజన్న మృతదేహం

ధర్మపురి: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిన్ననక్కలపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోర్లకుంట రాజన్న (50)కు కొంతకాలంగా మతిస్థిమితం లేదు. ఆయన బాగోగులు సోదరుడు పెద్ద పోశం చూసుకుంటున్నాడు. గురువారం ఉదయం పోశం ధర్మపురి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారకమందు తాగాడు. గమనించిన బంధువులు పోశంకు సమాచారమిచ్చారు. ఆయన వచ్చి చూసేసరికి చనిపోయి ఉన్నాడు. పోశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

గుండెపోటుతో వలసజీవి మృతి

కోరుట్ల: పట్టణానికి చెందిన గల్ఫ్ కార్మికుడు అంబల్ల స్వామిదాసు (45) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. కొంతకాలంగా సౌదీఅరేబియా వెళ్లి వస్తున్న స్వామిదాసు.. రెండు నెలల క్రితం సెలవుపై ఇంటికి వచ్చాడు. మరో రెండురోజుల్లో మళ్లీ సౌదీ వెళ్లేందుకు విమానం టికెట్ బుక్ చేసుకున్నాడు. ఇంతలోనే గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మిస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- చందుర్తి–మోతుకురావుపేటల మధ్య రోడ్డు పరిశీలన
- మహాశివరాత్రి కోసం తాత్కాలిక ఏర్పాట్లు

చందుర్తి(వేములవాడ): చందుర్తి–మోతుకురావుపేట గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో శాశ్వత రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. వేములవాడ రాజన్న సన్నిధిలో జరిగే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ రోడ్డును తాత్కాలికంగా మరమ్మతు చేస్తున్నారు. ఈ పనులు గురువారం పరిశీలించి మాట్లాడారు. మేడిపల్లి, రాయికల్, భీమారం మండలాల భక్తులకు దూర భారం తగ్గించేందుకు చేస్తున్న రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో ఆర్టీసీ బస్సులను నడిపించేందుకు కోరుట్ల, వేములవాడ, జగిత్యాల డిపో మేనేజర్లను కోరనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అటవీ ప్రాంతంలో నిలిచిన మూడున్నర కిలోమీటర్ల రోడ్డుకు అటవీశాఖ నుంచి అనుమతులు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. చందుర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జిల్లా కార్యదర్శి గొట్టె ప్రభాకర్ తదితరులు ఉన్నారు.


చందుర్తి–మోతుకురావుపేట రోడ్డును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సెంటిమెంట్‌తో పబ్బం గడిపిన కేసీఆర్

- ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం

కరీంనగర్ కార్పొరేషన్: రాష్ట్రం బీఆర్ఎస్ కబంధ హస్తాల్లో నలిగిపోయిందని, సెంటిమెంట్‌తో పబ్బం గడిపిన చరిత్ర కేసీఆర్‌దని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అనడం లేదంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు కొత్త రాగం ఎత్తుకున్నారని మండిపడ్డారు. గురువారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ను వాడుకొని కేసీఆర్, ఆయన కుటుంబం రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. వందల ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ చెక్కు చెదరడం లేదని, కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రం నిర్మించిన స్వల్పకాలంలోనే కుంగిపోయి, పగుళ్లు చూపిందని ఎద్దేవా చేశారు. ఉద్యమ నేతగా చెప్పుకుంటూ రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారని అన్నారు. అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తారనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న కాంతం

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం బంధన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు స్పందన లభించింది. బీటెక్, ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్న 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. మూడు రౌండ్లలో వారికి పలు రకాల ఎంపిక పరీక్షలు నిర్వహించారు. చివరకు ఎంపికైన 15 మందికి బ్యాంకు హెచ్‌ఆర్‌లు సోంరాజ్ దత్త, జయరాం, శ్రీనివాస్ నియామక పత్రాలు అందించారు. విద్యార్థులను చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఏవో రాధాకృష్ణ, ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్‌కుమార్ తదితరులు అభినందించారు.


రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో బ్యాంకు ప్రతినిధులు

సాంకేతిక రంగాల్లో మహిళలు రాణించాలి


- జ్యోతిష్మతి కళాశాలల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్: మహిళలు సాంకేతిక రంగాల్లో ముందుండాలని, ఉద్యోగాల్లో మగవారి కంటే తక్కువ కాదని నిరూపించాలని జ్యోతిష్మతి కళాశాలల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతిష్మతి అటానమస్ కళాశాలలో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కోసం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేశారు. ఇందులో విద్యార్థినులకు 21 రోజులు పాటు శిక్షణ అందించనున్నట్లు ట్రైనర్లు తెలిపారు. మైక్రోసాఫ్ట్ అడ్వాన్స్ టెక్నాలజీతో 35 ప్రోగ్రామ్స్ అందిస్తున్నామని, విద్య, నైపుణ్యం పెంపొందించే కార్యక్రమాలు మహిళా సాధికారత అవకాశం కల్పిస్తుందని సూచించారు, మైక్రోసాఫ్ట్ సర్టిఫైడ్ డేటా కోసం 115 మంది కళాశాల విద్యార్థినులు, యువత, మహిళా అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని పేర్కొన్నారు. సాంకేతిక రంగాల్లో మహిళలు రాణించేందుకు అవకాశాలు సృష్టించుకునేందుకు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగ అవకాశాలను కూడా పొందవచ్చని సూచించారు. విద్యార్థినులు అన్నిరంగాల్లో ముందుకురావాలని, అన్నింట్లో మెరుగైన సాంకేతిక జ్ఞానం పెంపొందించుకోవాలని, భవిష్యత్‌లో మంచి నైపుణ్యంతో కూడిన స్థానం సుస్థిరం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సెక్రటరీ కరస్పాండెంట్ సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్.రావు, డీన్ డాక్టర్ పీకే.వైశాలి, డీన్ డాక్టర్ సంపత్‌రావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.జగదీశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న ట్రైనర్ మల్లికార్జున్

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పాలకుర్తి(రామగుండం): పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద గురువారం లారీ ఢీకొని పెద్దపల్లికి చెందిన ఎంఏ ఖదీర్ (52) దుర్మరణం చెందాడు. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వివరాల ప్రకారం.. ఖదీర్ రామగుండంలోని సబ్‌ట్రెజరీ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం స్కూటీపై విధులకు వెళ్తుండగా టోల్‌ప్లాజా వద్ద లారీ ఢీకొనడంతో సమీపంలో రహదారి పక్కన పార్కింగ్ చేసి ఉన్న మరో లారీకి ఖదీర్ తగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. అయితే ఖదీర్‌ను ఢీకొట్టిన లారీ ఆగకుండా వెళ్లిపోయింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని టోల్‌ప్లాజా, కేఎఫ్‌టీ సంస్థకు సంబంధించిన సీసీ పుటేజీలను పరిశీలించారు. వాటి ఆధారంగా లారీని గుర్తించారు. ఎన్టీపీసీ యాష్‌పాండ్ నుంచి బూడిద లోడుతో కరీంనగర్ వైపు వస్తుండగా లారీని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతుడి సోదరుడు జావిద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.


ఖదీర్ మృతదేహం

లారీల పార్కింగ్‌తో ప్రమాదాలు

కన్నాల టోల్‌ప్లాజా వద్ద రహదారికి ఇరువైపులా ఇష్టారీతిగా లారీలను పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సాధారణంగా టోల్‌ప్లాజా వద్ద నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. రద్దీ ప్రాంతంలో రహదారికి ఇరువైపులా పదుల సంఖ్యలో లారీలను వరుసగా నిలిపివేస్తుండటంతో ఇతర వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి టోల్‌ప్లాజా ప్రాంతంలో లారీలను పార్కింగ్ చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాటక రంగ ప్రముఖుడు రాజేశం మృతి


రాజేశం (ఫైల్)

కరీంనగర్ కల్చరల్: కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న నాటక రంగ ప్రముఖుడు మ్యాడారం రాజేశం(65) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. కోనరావుపేట మండలంలోని కనగర్తికి చెందిన రాజేశం వృత్తి రీత్యా లోయర్ మానేరు డ్యాం క్యాంపులో ట్రైనర్‌గా, డ్రాఫ్ట్‌మెన్‌గా, జేటీవోగా పని చేశారు. నాటక రంగంపై ఆసక్తితో నాలుగు దశాబ్దాలుగా ఎల్ఎండీలో తిమ్మాపూర్ గ్రామ నవోదయ సమితి కళాకారులతో, నీటిపారుదల శాఖ ఉద్యోగి గోపన్నతో కలిసి శ్రీవేంకటేశ్వర కళాసమితిని ప్రారంభించారు. అప్పటి నాటక కళాకారులు గోపన్న, నారాయణ, జ్ఞానేశ్వర్, కనకమూర్తిలతో కలిసి ఎల్ఎండీ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో నాటకాలు ప్రదర్శించారు. ఎల్ఎండీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ప్రతీ దసరాకు రావణ వధ కార్యక్రమం నిర్వహించారు. అప్పటి నీటి పారుదల శాఖ ఉద్యోగి, తిమ్మాపూర్‌కు చెందిన ప్రస్తుత సినీ, టీవీ నటుడు కేతిరెడ్డి మల్లారెడ్డి, హనుమంతరావు, ఎం.రాజు, పబ్బ రాజమౌళి, అడిశర్ల సత్యనారాయణ, రాజేశ్వరరావు, స్వామి తదితరులతో కలిసి అక్షర ఉజ్వల, కళాజాతలు, బ్రహ్మోత్సవాలు, బతుకమ్మ ఉత్సవాల్లో అనేక నాటికలు ప్రదర్శించారు. అనేక షార్ట్ ఫిలింస్‌లో నటించారు. జేటీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, జిల్లా సాంస్కృతిక సంస్థల, కళాకారుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. రాజేశం మృతి పట్ల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వైఎస్.శర్మ, గజ్జె లక్ష్మణ్, కుమార్ మహర్షి, వై.అనిల్‌కుమార్ గౌడ్, జి.కృపాదానం, జి.రఘువీర్‌సింగ్, రాధాకృష్ణ, కేతిరెడ్డి మల్లారెడ్డి, జె.రతన్‌కుమార్, రొడ్డ యాదగిరి, మంచాల రమేశ్, ఎం రాజేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు.